# 15

# "ప్రియులైన పిల్లల వలె క్రీస్తును పోలి నడుచుకొనుడి"

## (5:1-6)

"నడుచుకొనుడి" అను పదము మరలా 5వ అధ్యాయంలో వాడబడుచున్నది. క్రీస్తును మాదిరిగా తీసుకొని, వారు "ప్రేమ కలిగి నడుచుకొనవలెననియు," క్రీస్తు మరియు దేవుని రాజ్యములో స్వాస్థ్యము కలిగియున్న పరిశుద్ధులకు సముచితమైనదై యుండు రీతిలో జీవించవలెననియు పౌలు ఎఫెసీ పట్టణంలోని క్రైస్తవులను బ్రతిమలాడుచున్నాడు.

### దేవుని మరియు క్రీస్తు యొక్క ప్రేమను పోలి యుండుట (5:1, 2)

**1కావున మీరు ప్రియులైన పిల్లలవలె దేవునిపోలి నడుచుకొనుడి. 2క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను; ఆలాగుననే మీరును ప్రేమగలిగి నడుచుకొనుడి.**

**వచనములు 1, 2.** ఆ యా నిర్దిష్ట విధానాల్లో "నడుచుకొనుడి" అని ఇవ్వబడిన ఆదేశాలు ఎఫెసీ పత్రికలో (4–6 అధ్యాయాలు) పౌలు చెప్పుచున్న ప్రయోగాత్మక అన్వయింపు విభాగమౌతున్నది. 5:1లో గల **కావున** అను మాట ద్వారా ఈ హెచ్చరిక పౌలు ఇంతకు మునపే రచించిన విషయాలతో సంబంధంగలదై యున్నదని అర్థమౌతుంది. 4వ అధ్యాయంలో పేర్కొనబడిన నూతనపరచబడిన మనస్సు మరియు నూతన పురుషుడు. దేవుని పోలి నడుచుకొనుట ద్వారా ప్రదర్శింపబడవలసి యున్నది.

**అనుకరించువారు** అను పదము *mimētai* అను గ్రీకు పదము యొక్క అనువాదమై యున్నది, "అనుకరణ" "mimic" అను పదము దీని నుంచే పుట్టింది. క్రైస్తవులు **ప్రేమ కలిగి నడుచుకొనుట** ద్వారా **దేవుని** "అనుకరించవలసినవారై" యున్నారు. "దేవుని పోలి నడుచుకొనువారు" అను భావన, అనుకరించుటకు సంబంధించిన అసలు వ్యక్తీకరణము పాత నిబంధనలో లేకపోయినప్పటికిని, అది దానిలోని ఆదర్శమై యున్నది. "మీరు పరిశుద్ధులై యుండవలెను, ఏలయనగా మీ దేవుడనైన యెహోవానగు నేను పరిశుద్ధుడను" అని పాత నిబంధన ప్రజలకు సెలవియ్యబడింది (లేవీయకాండము 19:2). ఇది దేవుని అనుకరింపవలెనని చెప్పెడి ఒక ఆజ్ఞయై యుండింది. క్రొత్త నిబంధనలో, యేసు, "మీ తండ్రి కనికరముగలవాడై యున్నట్టు, మీరును కనికరముగలవారై యుండుడని" సెలవిచ్చాడు (లూకా 6:36). "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు, గనుక మీరును పరిపూర్ణముగా ఉండెదరని" కూడా యేసు సెలవిచ్చాడు (మత్తయి 5:48). క్రైస్తవులు, దేవుని

**ప్రియులైన పిల్లలు**గా, ఆయనను పోలి యుండునట్లు ఎదగవలెను. ఇదే పత్రికలో ఇంతకు మునుపు, క్రైస్తవులు దేవుని కుటుంబము లోనికి స్వీకరింపబడ్డారని పౌలు చిత్రీకరించాడు (1:4-6 చూడుము). 5:1లో, ప్రేమగల మన తండ్రి వలె యగుట ద్వారా మనము కుటుంబ పోలికను ధరించవలెనని పౌలు చెప్పుచున్నాడు. దేవుడు తన చర్యల ద్వారా ప్రజలతో సంబంధం కలిగియున్నట్టుగానే ఆయన పిల్లలు సహితము ఇతరులతో సంబంధం కలిగియుండుటకు ఆయన చర్యలు ప్రామాణికమై యుండాలి.

4:24లో, క్రైస్తవులు, నూతన పురుషుని ధరించుట ద్వారా, నీతి మరియు పరిశుద్ధత విషయంలో దేవుని పోలి యుండవలెనని పౌలు చెప్పుచున్నాడు. 4:32లో, క్షమాపణను మరియు కరుణాహృదయమును ప్రదర్శించుటలో సహితము మనము దేవుని పోలి యుండవలెనని పౌలు చూపిస్తున్నాడు. "ప్రేమ కలిగి నడుచుకొనుట"లో మనకు మాదిరి (5:2), లోకమును ఎంతో ప్రేమించి, తన అద్వితీయ కుమారుని అనుగ్రహించిన దేవుడై యున్నాడు (యోహాను 3:16), మరియు కుమారుడైన క్రీస్తు, "మన కొరకు తన్నుతాను అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను" (5:2). 1 మరియు 2 వచనాల్లో దేవుడు అని మొదట పేర్కొని ఆ తరువాత క్రీస్తు అని పేర్కొనబడుట, క్రీస్తును అనుగ్రహించుట ద్వారా దేవుడు తన ప్రేమను బయలుపర్చాడనియు, క్రీస్తు మనలను ప్రేమించి మన కొరకు తనను తాను అప్పగించుకొన్నాడనియు తెలియజెప్పు వాస్తవమును సామాన్యంగా నొక్కివక్కాణించుచున్నది.

దేవుని మరియు క్రీస్తు ప్రేమను పోలి నడుచుకొనవలెనని పేర్కొనుట వలన ఈ ప్రేమ మన యెడల ఎలా చూపింపబడిందో వర్ణించాల్సిన అవసరం పౌలుకు ఏర్పడింది: **క్రీస్తు ... మన కొరకు తన్నుతాను ... అప్పగించుకొనెను.** "తన్ను తాను అప్పగించుకొనెను" అను పదజాలము "తనను తాను మరణమునకు అప్పగించుకొనుటను" సూచిస్తుంది,[1] మరియు "మన కొరకు" అను మాటలు "మనలను బట్టి," లేక ఉచితముగా అనుగ్రహింపబడు ఆయన రక్షణ వరమును అంగీకరించు వారందరి "ప్రయోజనము కొరకు" అని అర్థమిచ్చుచున్నది.[2] పౌలు ఈ ఆలోచనను తన పత్రికలలో తరచుగా నివేదించాడు (రోమీయులకు 4:25; 8:32; గలతీయులకు 2:20; ఎఫెసీయులకు 5:25-27).

**అర్పణముగాను బలిగాను** అను పదజాలము క్రీస్తు మరణ సంకల్పమును నిర్వచించుచున్నది. పాత నిబంధన అర్పణలను మరియు బలులను నెరవేర్చుటకు ఆయన మరణించాడు, మరియు ఆయన చిందించిన రక్తము పాపములకు శాంతియు మరియు పాపక్షమాపణను కలుగజేయును (హెబ్రీయులకు 10:14-18; 1 యోహాను 2:2; 4:10 చూడుము). ఇంకా, దేవునికిని మానవులకును మధ్య ఉండిన సంబంధమును పాపము నాశనము చేయగా, క్రీస్తు మరణము సమాధానమును కలుగజేసింది (రోమీయులకు 5:11; 2 కొరింథీయులకు 5:18, 19 చూడుము). ఇది **పరిమళ వాసన** యని పౌలు క్రీస్తు అర్పణమును మరియు బలిని చిత్రించినప్పుడు, బహుశా ఆయన దేవుని నాసికారంధ్రములను శాంతింపజేయు సువాసన యని బల్యర్పణల గూర్చిన పాత నిబంధన ప్రకటనలను మననం చేసియుండవచ్చును (ఆదికాండము 8:21; లేవీయకాండము 1:9, 13, 17 చూడుము). క్రీస్తు యొక్క బల్యర్పణ దేవునికి అంగీకారమైందని ఆయన చెప్పుచుండెను. సహోదరులు ఆయన కొరకు చేసిన ఆర్థిక యాగము గూర్చి ప్రస్తావించినప్పుడు ఫిలిప్పీయులకు 4:18లో

పౌలు ఇదే విధమైన భాషను ప్రయోగించాడు.

ఎఫెసీయులు ఇతరుల యెడల అభివ్యక్తము చేయుచుండిన ప్రేమలో వారు దేవుని మరియు క్రీస్తును పోలి యుండవలసినవారై యుండిరి. "ఇతరుల సంక్షేమము గూర్చిన ఆందోళన మూలాన ఒకరి సొంత ఆసక్తులు బలిచేయబడుట నిశ్చయంగా సమాజంలో సామరస్యాన్ని పెంపొందించు అన్నిటిని మించిన సద్గుణలక్షణమై యున్నది."[3] పౌలు మాట్లాడుచుండిన ప్రేమ ఒక నిర్ణయమై యున్నది; అది కేవలము ఒక అనుభూతి కాదు, కానీ ఒకడు చేసికొను ఒక ఎంపికయై యున్నది. అదనంగా, ఈ ప్రేమ కార్యశీలకమైనదై యున్నది. ఇది కేవలము ఒకని నోటి మాటల్లో కాదు, కానీ వాడు చేయు చేతల్లో కనుపర్చబడుతుంది. చివరగా, ఇటువంటి ప్రేమ అవి ఎటువంటివైనను, షరత్తులు లేనిదై యున్నది. ఇది ప్రేమింపబడినవాడు చేయు లేదా చేయని దాని చేత కాదు, కానీ ప్రేమించువాని హృదయము చేతనే నిర్ధరింపబడుతుంది. క్రీస్తునందలి దేవుని ప్రేమ – అదొక ఎంపిక, క్రియతో కూడిన ప్రేమ మరియు షరత్తులులేని ప్రేమ – క్రైస్తవుడు అనుకరించవలసినటువంటి ప్రేమయై యున్నది.

## విధేయతతో కూడిన జీవిత విధానము చొప్పున జీవించుట (5:3–7)

**[3]మీలో జారత్వమే గాని, యే విధమైన అపవిత్రతయే గాని, లోభత్వమే గాని, వీటి పేరైనను ఎత్తకూడదు, ఇదే పరిశుద్ధులకు తగినది. [4]కృతజ్ఞతావచనమే మీరుచ్చరింపవలెను గాని మీరు బూతులైనను, పోకిరిమాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు, ఇవి మీకు తగవు. [5]వ్యభిచారియైనను, అపవిత్రుడైనను, విగ్రహారాధికుడైయున్న లోభియైనను క్రీస్తుయొక్కయు దేవునియొక్కయు రాజ్యమునకు హక్కుదారుడు కాడను సంగతి మీకు నిశ్చయముగా తెలియును. [6–7]వ్యర్థమైన మాటలవలన ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి; ఇట్టి క్రియల వలన దేవుని ఉగ్రత అవిధేయులైనవారిమీదికి వచ్చును.**

ఆయన 5:1, 2లో ప్రవేశపెట్టిన ప్రేమ సూత్రము యొక్క అన్వయమునకు సంబంధించిన భాగాన్ని పౌలు, 5:3–7లో నివేదించాడు. ఒకడు దేవుడు మరియు క్రీస్తు ప్రేమించిన విధంగానే ప్రేమించినప్పుడు, వాడు పాపిష్ఠి ఆలోచనలు తలంచకుండా, క్రియలు చేయకుండా నిగ్రహించుకొనునని ఆయన చూపించాడు. దేవుని మరియు క్రీస్తును పోలి నడుచుకొనుటకు ప్రయత్నించువాడు లైంగిక సంభోగ అనుచిత ప్రవర్తనకు సంబంధించిన కోరిక మరియు చర్యలు, దుర్భాష, అశ్లీలత, దేవుడులేని ముచ్చెట్లు, మరియు ఇట్టి ప్రవర్తనతో కూడ కలిసియుండు బూతులకు దూరముగా ఉంటాడు.

**వచనము 3.** మొదట, **జారత్వము**ను పౌలు నిర్దిష్టంగా పేర్కొన్నాడు. దీనికి సంబంధించిన గ్రీకు పదము *porneia*, "ఇదొక విస్తృతమైన పదమై యుండి, సర్వసాధారణ లైంగిక అనైతికమును, ప్రత్యేకించి వ్యభిచారము మరియు వేశ్యాసాంగత్యమును సూచిస్తుంది."[4] ఈ పదము KJVలో "జారత్వము" అని అనువదింపబడింది, అయితే NASB యోహాను 8:41 మరియు అపొస్తలుల కార్యములు 15:20, 28, 29; 21:25లో గల పదములను – వ్యభిచారము మరియు జారత్వము – ఉపయోగించుచున్నది.

"వ్యభిచారము" (*moicheia*) అను మాట ఒకడు మరొకని భార్యతో కలిగియుండు

చట్టబద్ధముకాని లైంగిక సంబంధము గూర్చి చెప్పుకొను సందర్భములో వాడబడుచుండగా, "జారత్వము" అను పదములో చట్టబద్ధముకాని లైంగిక సంబంధములన్నీ కలిసివున్నాయి, ఉదాహరణ తోడబుట్టినవారితో గల లైంగిక సంబంధము, పురుషులలో స్వలింగ సంపర్కము, మరియు వ్యభిచారము మొదలగునవి యూదా వ్రాసిన పత్రికలోని 7వ వచనం, అచ్చట నివసించుచుండిన ప్రజలు "సిగ్గుమాలిన పరశరీరానుసారమునకు" తమ్మును తాము అప్పగించుకొనిన పట్టణములై యుండినవని, సొదొమ మరియు గొమొఱ్ఱాల గూర్చి చెప్పుచున్నది (ఆదికాండము 19:1–11 చూడుము). ఈ పట్టణముల పాపమును వర్ణించుటకు యూదా *ekporneuō* అను పదమును ప్రయోగించాడు. ఇంకా, సొదొమ పట్టణములోని పురుషులు దేవుని వార్తాహరులుగా వారియొద్దకు వచ్చిన ఇద్దరు పురుషులతో లైంగిక సాంగత్యము చేయవలెనని కోరుకున్నారని కూడా ఆదికాండము 19వ అధ్యాయం సూచిస్తుంది. ప్రస్తుతము మనము చెప్పుకొనుచున్న ఈ పదమలను పరిశుద్ధ బైబిలు ప్రయోగించుచున్న విధములను పరీక్షించిన మీదట, "వ్యభిచారము" అనగా, లైంగిక సంబంధము పెట్టుకొనిన వారిలో స్త్రీగాని పురుషుడుగాని లేదా ఇరువురు కూడా వివాహము చేసికొనినవారై యుండియు, తత్ సంబంధము ద్వారా చేసిన పాపమై యున్నదనియు, "జారత్వము" అనగా, వ్యభిచారమతోపాటు (దానికే పరిమితమై యుండక) ఇతరమైన లైంగిక సంబంధములన్నియు పాపములై యున్నవని ఆలోచించుట సముచితమని అగుపించుచున్నది. "వ్యభిచారము" మరియు "జారత్వము" అను మాటలు కొన్ని పర్యాయములు ఒకే వాక్యభాగములో కలిపి పేర్కొనబడి యున్నవి (మత్తయి 15:19; 19:9 [KJV]; మార్కు 7:21, 22; హెబ్రీయులకు 13:4 చూడుము).

*Porneia* అను పదము NIVలో "లైంగిక సంభోగ అవినీతి" అని అనువదింపబడి, ఈ పదము యొక్క సవిస్తరమైన స్వభావాన్ని నొక్కివక్కాణించుచున్నది. అందులో దేవుడు నిషేధించిన లైంగిక సంబంధమైన ఏ కార్యకలాపమైనను, అది ఒకరినొకరు వివాహము చేసికొనిన దంపతులు కానివారు కలిగియుండు లైంగిక సంబంధమైనా, పురుషుడు మరియు జంతువు కలిగియుండు లైంగిక సంబంధమైనా (నిర్గమాకాండము 22:19), పురుషులలోని స్వలింగ సంపర్కమైనా, లేక స్త్రీలలోని స్వలింగ సంపర్కమైనా (రోమీయులకు 1:26, 27) అయియుండవచ్చును.

రెండవదిగా, పౌలు అది **యే విధమైన అపవిత్రతయైనను** దానిని నిషేధించాడు. ఇచ్చట వాడబడిన గ్రీకు నామవాచక పదము *akatharsia* అయియున్నది, మరియు నైతికంగా "ఆలోచనలు మరియు జీవితములోని అపవిత్రత" అని అర్థమిచ్చుచున్నది.[5] *Akatharsia* అను పదము ఈ వాక్యభాగములోను ఇతర ఉల్లేఖనములలోను లైంగిక సంభోగ పాపముతో సంబంధము గలదై యున్నది (2 కొరింథీయులకు 12:20, 21; గలతీయులకు 5:19; కొలొస్సయులకు 3:5; 1 థెస్సలొనీకయులకు 4:3, 7 చూడుము). ఎఫెసీయులు లైంగిక సంబంధముతో కూడిన చర్య వలన కలుగు పాపము విషయంలో మాత్రమే కాదు, కానీ సంబంధిత ఆలోచన విషయంలో సహితము వారు తమ్మునుతాము నిగ్రహించుకొనవలెనని పౌలు ఆశించాడు.

మూడవదిగా, పౌలు **లోభత్వమును** ("పేరాస"; KJV) పేర్కొన్నాడు. "లోభత్వము" (*pleonexia*) అనగా, ఎక్కువగా లేదా ఇతరులు కలిగియున్నది "వానికి లేనిదెల్లా

కలిగియుండవలెనను కోరికయై యున్నది."[6] ఈ పదము దానిలో నుంచి "అనైతికము" మరియు "అపవిత్రత" పుట్టుకొనివచ్చు సమస్యను గుర్తించుచున్నది. "లోభత్వము" ఇహలోక విషయాలు వీలైనంత ఎక్కువగా కలిగియుండవలెనను కోరికను సూచింపవచ్చును, ఈ సందర్భంలో అది లైంగిక సంభోగము కొరకైన కామేచ్ఛను కలిగియుండుటను సూచింపవచ్చును. ఇతర వాక్యభాగాల్లో క్రొత్త నిబంధన *porneia*తోపాటుగా *pleonexia* అను పదమును ప్రయోగించుచున్నది. ప్రస్తావింపబడుచున్న పేరాస, ఇహలోక విషయాల కొరకైన కోరికను మించినదై యున్నదని ఇది సలహా ఇచ్చుచున్నది (1 కొరింథీయులకు 6:9, 10; కొలొస్సయులకు 3:5 చూడుము).

**వీటి పేరైనను ఎత్తకూడదు** అను మాటలు అపొస్తలుడు 12వ వచనంలో వ్రాసిన విషయాన్ని అతురతతో అపేక్షించుచున్నవి: "ఏలయనగా అట్టి క్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పనులను గూర్చి మాటలాడుటయైనను అవమానకరమై యున్నది." 3వ వచనంలోని నిషేధము బలమైనది మరియు ఉద్ఘాటనతో కూడినదైన గ్రీకు వ్యతిరేకార్థక *mēde* చేత పరిచయము చేయబడుచున్నది. ఈ పాపముల గూర్చి చర్చించుట "అవి సహింపబడుచున్నవి గనుక పరోక్షంగా వాటి అభ్యాసమునకు ప్రోత్సాహకమును కూడా ఇచ్చు వాతావరణమును సృష్టించును" అనునది పౌలు చేయుచున్న సహేతుకమైన వాదనయై యుండవచ్చును.[7]

**ఇదే పరిశుద్ధలకు తగినది** అను పదజాలము లైంగిక సంబంధమైన పాపములకు దూరముగా ఉండునట్లు ఒక ప్రోత్సాహకమును సమకూర్చుచున్నది. దేవుని పరిశుద్ధమైన ప్రజలు లోకమునకున్న దాని కంటె ఒక భిన్నమైన ప్రామాణిక జీవితమును జీవిస్తారు. దేవుని మరియు క్రీస్తును పోలినవారముగా, మనము "పరిశుద్ధులమును నిర్దోషులమునై" యుండవలెను (1:4–6). "తగినది" (*prepō*) అను మాట క్రైస్తవుని పరిశుద్ధ జీవితము గూర్చినదై యున్నది. (పౌలు ప్రయోగించిన ఈ పదము యొక్క ఒక రూపమును తీతు 2:1లో చూడుము.) పౌలు 1 థెస్సలొనీకయులకు 4:3–7 మరియు 1 తిమోతి 2:10లో లైంగిక అనైతికమును క్రైస్తవుని పరిశద్ధ జీవితముతో పోల్చుచు వాటి మధ్య గల తారతమ్యమును చూపించాడు.

**వచనము 4. బూతులు** అను మాట *aischrotēs* యొక్క అనువాదమై యుండి, "మొత్తం మీద లజ్జలేని, అనైతిక నడవడిక" అని అర్థమిచ్చుచున్నది;[8] కానీ అది **పోకిరి మాటలైనను** మరియు **సరసోక్తులైనను** అను మాటలతో కూడ ఉపయోగింపబడినందు వలన, అది ప్రత్యేకించి అశ్లీల మాటలను సూచించుచున్నది. ("దూషణ మాటలు" లేక "బూతు భాష" [NIV] అను అర్థముతో పౌలు *aischrologia* అను పదమును కొలొస్సయులకు 3:8లో ప్రయోగించాడు, చూడుము.) "పోకిరి మాటలు" *mōrologia* అను పదము యొక్క అనువాదమై యుండి, *mōros* ("మూర్ఖపు") మరియు *logos* ("సంభాషణ") కలిసియుండుటకు సంయుక్త పదముగా,[9] ఇచ్చట లైంగిక సంబంధ పాపమలను గూర్చిన మూర్ఖపు సంభాషణను సూచించుచున్నది. పౌలు ఈ నిషేదమును "సరసోక్తులతో" ముడిపెట్టాడు, ఇది *eutrapelia* యొక్క అనువాదమై యున్నది, మరియు ఈ సందర్భములో లైంగిక సంబంధ కార్యకలాపములను గూర్చిన "అశ్లీల సరసోక్తులు" అని అర్థమిచ్చుచున్నది.[10] లైంగిక సంబంధమైన పాపములను ఎఫెసీయులు ఒక తమాషాగా పరిగణించవలెనని

పౌలు ఆశించలేదు. ఈ పాపముల పట్ల ఇటువంటి వైఖరిని ప్రదర్శించుట వలన అట్టి పాపములను సహించగల లేదా వాటిలో జోక్యము కలుగజేసికొనుటకు ఒక అనుకూలమైన వాతావరణము సృష్టింపబడును. నోటి మాటలకు సంబంధించిన ఈ పాపములు **తగినవి కావని** లేక దేవుని పరిశుద్ధులకు యుక్తము కానివని పౌలు ఘోషించాడు.

**కృతజ్ఞతావచనములు ఉచ్చరించుటయే** పరిశుద్ధులకు తగినదై యున్నది. కృతజ్ఞతావచనములు ఉచ్చరించుట అనగా, దేవుడు ఉపకార స్వభావముతో ఇచ్చువాడై యున్నాడని గుర్తించుట మరియు మనము ఎవని సన్నిధిలో నివాసముంటున్నమో ఆయనే దేవుడని అంగీకరించుట మరియు ఆయన పరిశుద్ధులముగా మనము లెక్క ఒప్పజెప్పవలసినవారమై యున్నది కూడా ఆయనకే అని ఒప్పుకొనుటయై యున్నది. కృతజ్ఞతావచనములు ఉచ్చరించుట పాపములో జీవించుటకు లేదా పాపమును తమాషాగా పరిగణించుటకు విరుగుడు ఔషధమై యున్నది. పాపములో జీవించువారు దేవుని గూర్చి ఆలోచించరు గనుక, ఇతర విషయాలకు వలె, వారు కృతజ్ఞతలేనివారై యుందురు.

**వచనము 5.** ఎఫెసీయులను యింకా ఎక్కువ ప్రోత్సాహించుటకు, ఇంత వరకు పేర్కొనబడిన దుర్వ్యసనములలో పాల్గొనువారందరికి పౌలు ఒక కఠోరమైన హెచ్చరికను జారీచేసాడు: **వ్యభిచారియైనను, అపవిత్రుడైనను, విగ్రహారాధికుడైయున్న లోభియైనను క్రీస్తు యొక్కయు దేవుని యొక్కయు రాజ్యమునకు హక్కుదారుడు కాడను సంగతి మీకు నిశ్చయముగా తెలియును.** ఇచ్చట, పేరాసగలవారు విగ్రహారాధికులై యున్నారను ఆలోచనను పౌలు చేర్చాడు. లైంగిక సంబంధమైన పాపములు చేయుటకు అత్యాశ కలిగియుండుట, ఎవరితోనైతే ఈ పాపము చేయబడునో వానికి/ఆమెకు, లేదా ఇట్టి చర్యయే, వారికి అది విగ్రహారాధాన యౌతుంది. దేవుని కంటె ముందుంచబడునది అది ఏదైనను, అదొక విగ్రహమే ఔతుంది, గనుక ఈ వాక్యభాగములో లైంగిక సంబంధమైన పాపము విగ్రహమై యున్నది. ఈ విధముగా విగ్రహారాధికులై యుండువారు "క్రీస్తు యొక్కయు దేవుని యొక్కయు రాజ్యమనకు హక్కుదారులు కారు." పౌలు అంతకు మునుపు పరిశుద్ధుల స్వాస్థ్యము గూర్చి చెప్పాడు (1:14, 18), గనుక మన స్వాస్థ్యము మనకు లభించకండా చేయు ఏ విధమైన అభ్యాసమునకైనను దూరమగా తొలగిపోవునట్లు ఈ హెచ్చరిక పరిశుద్ధులకు ఉద్దేశింపబడినదై యున్నది. క్రైస్తవులు పరిశుద్ధమైన జీవితము జీవించునట్లు వారిని ప్రోత్సాహించవలెనని రాజ్యమునకు హక్కుదారులు కానివారగుటకు ఆస్కారముగలదని తెలియజెప్పు వివరణ మరొక చోట 1 కొరింథీయులకు 6:9లోను, గలతీయులకు 5:21లోను పేర్కొనబడి యున్నది. పౌలు వర్ణించిన పాపములలో జీవించువారు దేవుని మరియు క్రీస్తు యొక్క నియమమునకు – రాజ్యమునకు – వెలుపల జీవించుచున్నారు గనుక నిత్య రాజ్యములో లభించు ఏ స్వాస్థ్యమునైనను వారు కోల్పోవుచున్నారు.

**వచనములు 6, 7.** ఆయన తన హెచ్చరికను జారీచేసిన తరువాత, పౌలు **వ్యర్థమైన మాటలవలన ఎవడును మిమ్మును మెసపరచ నియ్యకుడి, ఇట్టి క్రియల వలన దేవుని ఉగ్రత అవిధేయులైనవారి మీదికి వచ్చును గనుక మీరు అట్టివారితో పాలివారై యుండకుడని** చెప్పాడు. అనైతికమైన నడవడికి చనువియ్యవచ్చును లేదా దానిని సహించవచ్చునను ఆలోచనలు వారిలో పుట్టించుటకు ఎవడును వారిని మోసము చేయకుండునట్లు ఎఫెసీయులు తగు జాగ్రత్త వహించవలసినవారై యుండిరి. చాకచక్యముతో కూడిన

ఇటువంటి కుయుక్తులు "అవిధేయుల కుమారుల" మీదికి రాబోవుచుండిన దేవుని ఉగ్రతను ఉపేక్షించినవారి హృదయములలో నుండి వచ్చు వ్యర్థమైన మాటలు ద్వారా అమలు చేయబడవచ్చును. తరుచుగా లేఖనములలో, లక్షణములు స్పష్టమగా అగుపించువాడు, అదే గుణముగల వాని "కుమారుడు" లేక "పిల్లలు" అని పిలువబడ్డారు (మార్కు 3:17; అపొస్తలుల కార్యములు 4:36). 2:3లో, ఎఫెసీయులు క్రైస్తవులు కాక మునుపు వారు దేవుని ఉగ్రతకు పాత్రులైయుండినవారి లక్షణము చేత గుర్తింపబడిన సమాజములోని విభాగమునకు చెందియుండినందు వలన "ఉగ్రత పిల్లలై" యుండిరని పౌలు పేర్కొన్నాడు. 6వ వచనంలో, పౌలు "అవిధేయులైన కుమారుల" గూర్చి మాటలాడుచున్నాడు. లైంగిక సంబంధమైన పాపములను అభ్యసించువారికి దేవుని తీర్పు ఉండదని నమ్ముచూ నేర్పించుచూ మొదటి శతాబ్దములో జీవించినవారు అవిధేయులుగా గుర్తింపబడ్డారు (రోమీయులకు 1:18-32 చూడుము).

మనము దేవుని మరియు క్రీస్తును పోలి ప్రేమ కలిగి నడుచుకొనవలెనని ఉదాహరణంగా చిత్రీకరించుటకు పౌలు లైంగిక సంబంధమైన పాపముల గూర్చిన ఒక చర్చను ఎందుకు ప్రయోగించాడు? దేవుడు మరియు క్రీస్తు ప్రేమించినట్లు, ప్రేమించుట అనగా, మరొకరి మంచిని - వానికి హాని కలుగజేయుటకు కాదు కానీ సహాయము చేయుటకు, వానిని నశింపజేయుటకు కాదు కానీ పైకెత్తుటకు - వెదకుటయై యున్నదనునది సామాన్య సమాధానమై యున్నది. లైంగిక సంబంధమైన పాపములు ఇందుకు వ్యతిరేకమైన ప్రభావము కలిగియున్నవి; అవి బైబిలు సంబంధమైన ప్రేమను ప్రదర్శించవు, కానీ ఇతరులను వ్యక్తిగత ప్రసన్నతతో కూడిన ప్రయోజనముల కొరకు ఉపయోగించుకొనుట ద్వారా ప్రజల పట్ల చూపింపబడు చిన్న చూపును చూపించును. లైంగిక అనుభూతుల కొరకైన సామర్థ్యమును సృజించినది దేవుడే. గనుక దేవుడు ఉద్దేశించిన సందర్భము యొక్క పరిధుల లోపలనే పంచుకొనబడినప్పుడు అది ఎంతో సుందరమైనదై యుండును. దేవుడు రూపకల్పన చేసిన స్త్రీపురుష సంయోగము ఎల్లప్పుడు వివాహములో, అనురాగ సహితంగా, మరియు జీవితాంతము వరకైన నిబద్ధతతో కూడినదై ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ మధ్య ఉండవలసిన సంబంధమమై యున్నది. ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ వారి వివాహమునకు వెలుపట లైంగిక సంబంధమునకు చనువిచ్చుట, వివాహ సంబంధమైన నిబద్ధత మరియు బాధ్యతలు లేకుండానే వివాహ సంబంధమైన ప్రత్యేక హక్కుల కొరకు వెదకుటయే ఔతుంది. వివాహమునకు వెలుపట లైంగిక సంబంధము కలిగియుండుట, ఇతరులను వాడుకొనుటయే ఔతుంది కానీ వారిని ప్రేమించుట కాదు. ఇట్టి లైంగిక సంయోగ సంబంధము ఇరువురి సమ్మతితో కూడినదే అయినప్పటికినీ, అది ఇటువంటి సంబంధములో కచ్చితంగా ఉండవలసిన నిబద్ధత లేకుండానే మరొక వ్యక్తిని వ్యక్తిగత ప్రసన్నతతో కూడిన ప్రయోజనము కొరకు వాడుకొనుటయే ఔతుంది. లైంగిక సంబంధ పాపము, నీతిబాహ్యమైన చర్య ఎదిరింపబడజాలనంతగా ఎవరినో ఒకరిని ప్రేమించుచున్న విషయం కాదు. విశేషంగా, అది బాధ్యతను అంగీకరించుటకు అతి తక్కువగా ప్రేమించుటయైయున్నది. ఒకరు వివాహములో నుండు బాధ్యతలకు అంకితము చేసుకొననట్లయితే, దేవుడు వివాహమునకు జతచేసిన ప్రత్యేకార్హతలను అనుభవించుటకు ఆ వ్యక్తికి ఎటువంటి హక్కైనను లేదు. వివాహమునకు వెలుపటి లైంగిక సంబంధము బొత్తిగా తప్పు ఏలయనగా

అది తప్పే అని దేవుడు సెలవిచ్చాడు (హెబ్రీయులకు 13:4), అంతమాత్రమేగాక, ఇతరులు ప్రేమింపబడవలసినవారై యున్నారే కానీ ఉపయోగించుకొనబడవలసిన వారు కానందు వలన కూడా అది తప్పే.

## అన్వయము

**ప్రేమ కలిగి నడుచుకొనుట (5:1–7)**

5:1–7లో, మహిమన్వితమైన సంఘ సభ్యులుగా క్రైస్తవులు "నడుచుకొనవలసిన" నాలుగు విధానములలో రెండవ విధానమును పౌలు చర్చించాడు. పత్రికలోని ఈ విభాగములో, మనము "ప్రేమ కలిగి నడుచుకొనవలెనని" పౌలు చెప్పాడు.

*"దేవుని అనుకరించువారు."* మనము "దేవునిని అనుకరించుచున్నవారము" అగునట్లు మరియు క్రీస్తును వెంబడించుటకు "ప్రేమ కలిగి నడుచుకొనవలెను." దేవుడు పాపుల కొరకు చేసిన సమస్తము ప్రేమ వలన కలిగిన ప్రోత్సాహకము నుంచి పుట్టినదని పౌలు ఇదివరకు చెప్పాడు (2:1–10 చూడుము). దేవుని పిల్లలముగా, ఆయన ప్రేమించుచున్నట్లే మనము కూడా ప్రేమించుట ద్వారా మనము ఆయన కుటుంబ పోలికలను ధరించవలసినవారమై యున్నాము (5:1).

క్రీస్తు, మనలను ఎంతో ప్రేమించుచున్నాడు గనుకనే, మన నిమిత్తము ఒక పరిపూర్ణమైన పాపపరిహారార్థ బలియాగముగా, దేవుని చేత అంగీకరింపబడిన బల్యర్పణగా, తనను తానే అప్పగించుకొన్నాడు. మన జీవితములకు ఆయనే సరైన మాదిరియై యున్నాడు (రోమీయులకు 8:29; 1 పేతురు 2:21 చూడుము), గనుక ఇతరులను ప్రేమించుట ద్వారా మనము క్రీస్తును పోలి నడుచుకొనవలెను (5:2).

*"పరిశుద్ధులు" లేదా "పాపులు."* మనన జీవితము ద్వారా "పరిశుద్ధులు" (5:3) మరియు "అవిధేయులైన కుమారులు" (5:6) జీవించు విధానములో గల తారతమ్యమును ప్రదర్శించుటకు మనము "ప్రేమ కలిగి నడుచుకొనుచున్నాము." "అవిధేయులైన కుమారుల" (5:3–5) జీవితములలో యథార్థమైన ప్రేమ లేకపోవుటను సాదాహరణంగా చిత్రీకరించుటకు పౌలు లైంగిక సంబంధమైన పాపములను ఉదాహరణముగా ఉపయోగించాడు.

"పరిశుద్ధులు" ఇతరుల యెడల కలిగియుండు ప్రేమ చేత గుర్తింపబడవలసినవారై యున్నారు. మనము వారిని సాటి మానవులనుగా గౌరవించుచు, వారికి మేలు చేయుటకు వెదకవలెను. లైంగిక సంబంధమైన పాపములు చేయువారు వారిని ప్రేమించుట లేదు; వారు ఇతరులను వారి సొంత ఆహ్లాదానుభూతుల కొరకు ఉపయోగించుకొనుచున్నారు.

"ప్రేమ కలిగి నడుచుకొనుట" అనగా, ఒకడు తన జీవితము పరిశుద్ధుల జీవితమునకు "తగినదై" యుండునట్లు ప్రవర్తించుటయై యున్నది. కృతజ్ఞతావచనములనే ఉచ్ఛరించుట (5:3, 4) మరియు దేవుని చిత్తమునకు విరుద్ధమైనవై (5:6) మోసపూరితమైన జీవిత విధానముల నుంచి కాపాడబడునట్లు తగు జాగ్రత్తలు వహించుట ద్వారా మనము "ప్రేమ కలిగి నడుచుకొందుము."

క్రైస్తవ ప్రవర్తన దేవుని మరియు క్రీస్తు ప్రేమను అనుకరించునదై యున్నది. ఇట్టి జీవిత విధానము మనము ఒకప్పుడు జీవించిన తీరును మరియు ఇప్పటికిని లోకము జీవించుచున్న

తీరును సహితము అధిగమించినదై యున్నది.

జేయ్ లాక్‌హార్ట్

---

సూచనలు

[1]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament,* ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:350. [2]Ibid. [3]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 312. [4]Ibid., 321. [5]C. G. Wilke and Wilibald Grimm, *A Greek-English Lexicon of the New Testament,* trans. and rev. Joseph Henry Thayer (Edinburgh: T. & T. Clark, 1901; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1977), 21; కూడ చూడు Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 34. [6]Spiros Zodhiates, ed., *The Complete Word Study New Testament,* 2d ed. (Chattanooga, Tenn.: AMG Publishers, 1991), 948. [7]Lincoln, 322. [8]Salmond, 352. [9]Zodhiates, 938. [10]Ibid., 918.